
## 40 లక్షల ప్యాకేజీకి రెజ్యూమ్ అక్కర్లే!



బెంగళూరు: బెంగళూరు ఐటీ హబ్‌లోని ఓ ఏఐ స్టార్టప్ ఎక్స్ వేదికగా ఇచ్చిన ఉద్యోగ ప్రకటన అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ఈ కంపెనీ వ్యవస్థాపకుడు సుదర్శన్ కామత్ ఇచ్చిన ఈ ప్రకటనలో, క్రాక్‌డ్ ఫుల్‌స్టాక్ ఇంజినీర్‌ను నియమించుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. సంవత్సరానికి రూ.40 లక్షల ప్యాకేజీ చెల్లించనున్నట్లు తెలిపారు. బేస్ జీతం సంవత్సరానికి రూ.15-25 లక్షలు, ఈఎస్‌ఓపీస్ జీతం ఏడాదికి రూ.10-15 లక్షలు అని తెలిపారు. ఇందిరా నగర్‌లోని తమ కార్యాలయానికి వచ్చి పని చేయాలని, వారానికి ఐదు రోజులు పని దినాలని తెలిపారు. అభ్యర్థులకు 0-2 సంవత్సరాల అనుభవం ఉంటే సరిపోతుందని, ఏ కళాశాలలో చదివారనే దానితో సంబంధం లేదని, రెజ్యూమ్ అక్కర్లేదని పేర్కొన్నారు. వెంటనే ఉద్యోగంలో చేరవచ్చునని తెలిపారు. దీనిని అనేకమంది తమ బంధుమిత్రులకు ట్యాగ్ చేశారు. దీంతో ఉద్యోగార్థుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. కొందరు నెటిజన్లు ఈ కంపెనీ ఎంత కాలం ఉంటుందోనని అనుమానం వ్యక్తం చేశారు. కంపెనీలో నియామకాల కోసం ఈ విధానాన్నే ఎల్లప్పుడూ అనుసరిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సారి మాత్రమే ఇంత పెద్ద ఎత్తున ఎందుకు వైరల్ అయిందో తెలియడం లేదన్నారు. తమ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగుల్లో చాలా మంది టైర్-1 కళాశాలలో చదివినవారు కాదని, వారు తెలివైనవారు, చురుకైనవారు అని వివరించారు.

## ఆన్‌లైన్ వంటను లైవ్‌లో 'రుచి' చూడొచ్చు!



న్యూఢిల్లీ: నోరూరించే వంటకాలను టీవీ షోలలో తయారు చేస్తూ ఉంటే, వాటిని చూడటంతో సరిపెట్టుకునే కాలానికి ఇక తెర పడనుంది. టీవీ తెరలపై కనిపించే ఈ వంటకాల రుచిని ప్రేక్షకులు ఆస్వాదించే రోజులు వస్తున్నాయి. ఓహియో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తయారు చేసిన పరికరం ఈ అనుభూతిని పంచుతుంది. ఈ పరికరంలోని సెన్సర్స్ ఆహారం రుచిని ఎలక్ట్రికల్ సిగ్నల్స్ ద్వారా అంది పుచ్చుకొని రిమోట్ పరికరానికి అందిస్తుంది. ఆ రిమోట్ ఈ సమాచారాన్ని ఉపయోగించుకుని, ఆ ఆహారం రుచులను రసాయనాల రూపంలో వెల్లడిస్తుంది. టీవీ ముందు కూర్చున్న వ్యక్తి కింది పళ్లపై ఓ పరికరాన్ని ఉంచితే, అది జెల్స్ రూపంలో ఈ రసాయనాలను ఆ వ్యక్తి నోటిలోకి పంపుతుంది. టీవీ తెరపై కనిపించే ఆహార పదార్థాల అసలు రుచుల మాదిరిగానే ఈ రుచులు కూడా ఉంటాయి. తీపి, ఉప్పు, చేదు, కారం, లేదా వీటన్నిటి మిశ్రమం స్పష్టంగా తెలుస్తుంది. ఈ టెక్నాలజీని కేవలం ఆహారాన్ని రుచి చూడటానికి మాత్రమే కాకుండా.. ఆన్‌లైన్ షాపింగ్, రిమోట్ ఎడ్యుకేషన్, వెయిట్ మేనేజ్‌మెంట్, సెన్సరీ టెస్టింగ్ వంటివాటి కోసం కూడా ఉపయోగించవచ్చునని ఈ శాస్త్రవేత్తలు తెలిపారు. మెదడుకు గాయాలైనవారికి కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

## పచ్చ బొట్లతో హెచ్ఐవీ, క్యాన్సర్!



కర్నాటక, మార్చి 1: కర్నాటక ప్రభుత్వం పచ్చబొట్ల(టాటూ) పార్లర్లపై నియంత్రణ చర్యలకు సిద్ధమైంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా టాటూ పార్లర్లు నిర్వహించడం వల్ల చర్మ వ్యాధులు, చర్మ క్యాన్సర్, హెపటైటిస్-బీ, సీ, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌తో పాటు హెచ్ఐవీ కూడా సంక్రమించే ప్రమాదముందని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగిన విషయాన్ని అధికారులు ఉదహరిస్తున్నారు. టాటూ పార్లర్ల ట్రెండ్ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమస్థాయి మార్గదర్శకాలు రూపొందించుకునేలా కేంద్రం చట్టం రూపొందించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఈ మేరకు కర్నాటక ఆరోగ్యశాఖ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం టాటూ పార్లర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా చట్టాలేమీ లేకపోవడంతో నియంత్రణ కొరవడింది. డ్రగ్స్ లేదా కాస్మెటిక్స్ చట్టం పరిధిలోకి రాని లోహాలను వినియోగిస్తూ టాటూలు వేస్తున్నట్టు కమంత్రి దినేశ్ గుండురావు తెలిపారు. అపరిశుభ్రత, ప్రమాదకరమైన రసాయనాల వినియోగంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కాబట్టి టాటూ పార్లర్లపై తప్పనిసరిగా మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.



మక్కా మసీద్‌లో శనివారం ముస్లింల ప్రార్థనలు

## భారత్‌లో రంజాన్ మాసం ప్రారంభం

న్యూఢిల్లీ: భారత్‌లో శనివారం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. జామా మసీదు ఇమామ్, లక్నోలోని షాహి ఇమామ్ దీనిని ధ్రువీకరించారు. దీంతో మన దేశంతోపాటు పాక్, బంగ్లాదేశ్‌లలోని ముస్లింలు కూడా ఆదివారం తొలి రోజా చేస్తారు. వచ్చే నెలలో చంద్ర వంక దర్శనమివ్వడాన్ని బట్టి నెల ముగింపును నిర్ణయిస్తారు. సౌదీ అరేబియాలో శుక్రవారం రాత్రి చంద్ర వంక దర్శనమివ్వడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది.

## వాణిజ్య సిలిండర్‌పై రూ.6 పెంపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరను రూ. 6 పెంచినట్టు చమురు మార్కెటింగ్ కంపెనీలు శనివారం ప్రకటించాయి. దీంతో సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,797 నుంచి రూ. 1,803కి పెరిగింది. గడచిన ఐదేండ్లలో తాజాగా పెరిగిన రూ.6 పెంపు అతి తక్కువదని చెప్పవచ్చు. ఐఓసీ ధరల ప్రకారం 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర చెన్నైలో రూ.1,955 ఉంటుంది. 14.2 కిలోల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల ధరలు 2024 ఆగస్టు నుంచి ఎటువంటి మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయి.

## హిందీ వ్యతిరేకతకు కట్టుబడి ఉంటా

### పుట్టిన రోజున స్టాలిన్ ప్రకటన

చెన్నై: రాష్ట్ర స్వయం ప్రతిపత్తి, ద్విభాషా విధానం, హిందీ విధింపుపై వ్యతిరేకతకు కట్టుబడి ఉంటానన్నదే తన పుట్టినరోజు సందేశమని శనివారం 72వ జన్మదినం జరుపుకున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. తమిళనాడు ప్రయోజనలాను పరిరక్షించడం, రాష్ట్రంపై హిందీ విధింపును వ్యతిరేకించడం అనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తామంటూ పార్టీ కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ స్టాలిన్ నినదించగా కార్యకర్తలు ఆయనతో గొంతు కలిపారు.

## 'బ్యాలెట్ పేపర్' మీ పరిధిలోకి రాదు

### జేపీసీకి న్యాయ శాఖ జవాబు

న్యూఢిల్లీ : మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానానికి మరలే అంశం జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిధిలోకి రాదని కేంద్ర న్యాయ శాఖ స్పష్టం చేసినట్టు తెలిసింది. జేపీసీలోని కొందరు సభ్యులు మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని చేసిన సూచనకు న్యాయ శాఖ లిఖితపూర్వకంగా స్పందించాల్సి ఉంది. కమిటీ సభ్యులు చేసిన భిన్న సూచనలకు న్యాయ శాఖకు చెందిన లెజిస్లేటివ్ విభాగం సవివరంగా జవాబులు ఇచ్చినప్పటికీ బ్యాలెట్ పేపర్ విధానంపై చేసిన సూచనకు మాత్రం సూటిగా సమాధానం ఇవ్వలేదని తెలిసింది. బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని సూచించే పరిధి జేపీసీకి లేదని న్యాయశాఖ పేర్కొన్నట్టు తెలిసింది. ఈవీఎంల వినియోగం లేదా బ్యాలెట్ పేపర్ వాడకం అనే అంశాలను జేపీసీ పరిశీలించడం లేదని న్యాయ శాఖ తెలిపినట్టు వర్గాలు పేర్కొన్నాయి.

## ఎదురు కాల్పుల్లో ఇద్దరు నక్సల్స్ మృతి

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 1: మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు(నక్సలైట్లు) మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. సుక్మా జిల్లా కిస్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులు సమావేశమవుతున్నట్లుగా పోలీసు ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సుమారు 500 మంది సాయుధ బలగాలు ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించారు.



## 'ఫైటర్ జెట్'కు తొలి మహిళా పైలట్

### తనుష్క సింగ్ అసాధారణ ఫీట్

న్యూఢిల్లీ: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో (ఐఏఎఫ్) 'జాగ్వార్ ఫైటర్ జెట్'లో చేరటమంటే మామూలు విషయం కాదు. వ్యూహాత్మక, కచ్చితమైన వైమానిక దాడులకు ఆ విభాగం పేరొందింది. శాశ్వత నియామకంతో దీంట్లో చేరిన మొదటి మహిళా పైలట్‌గా తనుష్క సింగ్ గుర్తింపు అందుకున్నారు. జాగ్వార్ ఫైటర్ దళానికి పూర్తిస్థాయిలో ఎంపికైన తొలి మహిళా పైలట్‌గా ఆమె రికార్డ్ సృష్టించారు. తెలంగాణ, దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ పొందారు. హాక్ ఎంకే 132 ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడపటంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.

## ఇంధనం ఇవ్వొద్దు

### 15 ఏండ్లు దాటిన వాహనాలపై ఢిల్లీ ప్రభుత్వం ఆదేశం

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో వాయు కాలుష్య నివారణ కోసం ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా శనివారం మాట్లాడుతూ.. 15 ఏండ్లు దాటిన వాహనాలకు పెట్రోల్, డీజిల్ అమ్మొద్దని ఆదేశించినట్లు తెలిపారు. వాహనాల వయసును గుర్తించేందుకు పెట్రోల్ బంకుల వద్ద పరికరాలను అమర్చుతామన్నారు. ఈ అదేశాలను అమలు చేసే ప్రారంభంలో భారీ వాహనాలపై దృష్టి పెడతామని చెప్పారు. ఈ నెల 31 నుంచి ఈ ఆదేశాలను అమలు చేస్తామని ఆయన వెల్లడించారు.

## రోడ్లపై స్వేచ్ఛగా తిరిగేలా చూడండి

### మణిపూర్‌పై అమిత్ షా అదేశం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో భద్రతా పరిస్థితి సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం నాడిక్కడ ఓ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 8 నుంచి మణిపూర్‌లోని అన్ని రోడ్లపై ప్రజలు స్వేచ్ఛగా తిరిగే విధంగా చూడాలని అమిత్ షా అధికారులను ఆదేశించారు. అవాంతరాలు సృష్టించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఇందుకు సంబంధించి అవసరమైన సహాయాన్ని అందచేస్తుందని అమిత్ షా హామీ ఇచ్చారు. మణిపూర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల పొడవునా ఎంట్రీ పాయింట్ల వద్ద రెండు వైపులా కంచె నిర్మాణం పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## పోక్సో కేసులో చిన్నారిపై కలెక్టర్ నిందలు

### పోస్టింగ్ ఇవ్వకుండా ఆయనపై బదిలీ వేటు

చెన్నై : తమిళనాడులోని మయిలదుతురాయ్ జిల్లా కలెక్టర్ ఏపీ మహాభారతిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఈ జిల్లాలో మూడున్నరేండ్ల బాలికపై ఓ టీనేజర్(16) లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మహాభారతి బాలలపై లైంగిక దాడుల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమంలో శుక్రవారం మాట్లాడారు. తనకు అందిన నివేదికను బట్టి ఆ బాలిక తప్పుగా ప్రవర్తించిందని చెప్పారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో ప్రభుత్వం మహా భారతిని బదిలీ చేసింది.

# శిఖరాగ్ర చర్చల్లో యుద్ధం

- డొనాల్డ్ ట్రంప్-జెలెన్‌స్కీ మధ్య మాటల తూటాలు
- వైట్‌హౌస్‌లో అర్ధాంతరంగా ముగిసిన సమావేశం
- ఏ ఒప్పందం లేకుండానే ఉక్రెయిన్ నిష్క్రమణ



వాషింగ్టన్: నిత్యం ప్రశాంతంగా ఉండే వైట్ హౌస్ శుక్రవారం ఇద్దరు దేశాధినేతల వాగ్వాదంతో దద్దరిల్లింది. ఎవరూ తగ్గకపోవడంతో అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీల మధ్య జరిగిన సమావేశం రసాభాసగా మారింది. అమెరికా ఏం చేయాలో చెప్పవద్దంటూ జెలెన్‌స్కీని ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. దీంతో రష్యాతో యుద్ధంపై శాంతి, ఉక్రెయిన్‌లో అరుదైన ఖనిజాల తవ్వకాలకు సంబంధించిన ఒప్పందాలు జరగకుండానే జెలెన్‌స్కీ వైట్ హౌస్ నుంచి నిష్క్రమించారు.

**అనూహ్య పరిణామాలు**

ఉక్రెయిన్‌లో ఖనిజాల వెలికితీత, రష్యాతో యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో ఒప్పందానికి శుక్రవారం అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో అమెరికా సాయాన్ని ఉక్రెయిన్ పొందుతుందని అందరూ ఆశించారు. అయితే శ్వేత సౌధంలో ఇద్దరు నేతల మధ్య జరిగిన సమావేశంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇద్దరు నేతలు మీడియా, పలువురు దౌత్యవేత్తల సమక్షంలో రష్యా యుద్ధం గురించి గొడవపడ్డారు. మూడో ప్రపంచ యుద్ధంతో జూదం ఆడుతున్నారని, అమర్యాదగా ఉన్నారంటూ జెలెన్‌స్కీని ట్రంప్ నిందించగా, దానికి జెలెన్‌స్కీ దీటుగా బదులిచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ప్రస్తావిస్తూ హంతకుడితో రాజీ పడకూడదని అంటూ రష్యాపై ట్రంప్ వైఖరి ఏమిటని సూటిగా ప్రశ్నించారు. ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వడం కొనసాగించకపోతే అమెరికా 'భవిష్యత్తులో దాని ప్రభావాన్ని చవి చూస్తుంది' అని జెలెన్‌స్కీ చేసిన హెచ్చరికపై ట్రంప్ ఆయనను ఆపి 'మేమేమవుతామో మాకు చెప్పకండి. ఒక సమస్యను పరిష్కరించడానికి మేము ప్రయత్నిస్తున్నాం' అని అన్నారు. సామరస్యంగా ప్రారంభమైన సమావేశం వీరి వాదనలు, వాగ్వాదాలతో వేడెక్కడంతో ట్రంప్ సమావేశాన్ని ఆకస్మాత్తుగా ముగించారు.

ఉక్రెయిన్ దురాక్రమణకు పుతిన్‌ను బాధ్యుడిని చేయాలంటూ జెలెన్‌స్కీ చర్చల సందర్భంగా పట్టుబట్టారు. అదే సమయంలో రష్యా రెండో దాడిని చేయదన్న తన నమ్మకాన్ని ట్రంప్ పునరుద్ఘాటించారు. దీంతో 10 నిముషాల పాటు సమావేశంలో వాతావరణం వేడెక్కింది. 'నువ్వు చాలా చెడ్డ స్థితిలో ఉన్నావు, నీకు మరో అవకాశం లేదు' అని ట్రంప్ అనగా, తాను కార్డులు ఆడటం లేదని జెలెన్‌స్కీ బదులిచ్చారు. 'లేదు.. నువ్వు ఆటలు ఆడుతున్నావు. లక్షలాది మంది ప్రజల జీవితాలతో జూదం ఆడుతున్నావు. మూడో ప్రపంచ యుద్ధంతో జూదం ఆడుతున్నావు. నువ్వు చేస్తున్నదంతా నీ దేశాన్ని అగౌరవపరుస్తుంది, చాలామంది చెప్పినట్టు మీకు మద్దతు ఇచ్చిన దాని కంటే ఎక్కువ' అని ట్రంప్ బదులిచ్చారు. ఉక్రెయిన్‌కు కనుక అమెరికా మిలిటరీ సామగ్రి అందజేయకపోతే యుద్ధం రెండు వారాల్లో ముగిసేదని అన్నారు.

**ఎవరికీ తల వంచే ప్రసక్తే లేదు**

అమెరికా అధ్యక్షుడితో చర్చల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన వైఖరిని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. 'మా దేశ భూభాగంలో మేము ఉంటున్నాం. మేము అక్కడ ఉండేందుకు ఎవరి అనుమతి తీసుకోవాలి? మేం ఎవరికీ తల వంచే ప్రసక్తే లేదు. భవిష్యత్తులో రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే అమెరికా మా దేశాన్ని రక్షించాలని కోరుతున్నాను.' అని జెలెన్‌స్కీ చర్చల్లో స్పష్టం చేశారు.

**తక్షణం వైట్‌హౌస్‌ను వదిలి వెళ్లండి**

రెండు దేశాల మధ్య సమావేశం అర్ధాంతరంగా ముగియడంతో జెలెన్‌స్కీ, ఆయన బృందం తక్షణం వైట్ హౌస్‌ను విడిచి వెళ్లాలంటూ ఆదేశాలు వచ్చినట్టు అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఈ పరిణామాల పట్ల ఉక్రెయిన్ రాయబారి ఒక్సానా మారకరోవా ఆందోళన చెందారు. ట్రంప్‌తో వాగ్వాదం అనంతరం వైట్‌హౌస్ నుంచి బయటకు వచ్చిన జెలెన్‌స్కీ ఉక్రెయిన్ ఆవేదనను వినాలని ప్రపంచ దేశాలను కోరారు.

**మేము పంపిన నిధులకు లెక్కలు చూపండి**

ఉక్రెయిన్‌కు అమెరికా చేసిన వందల బిలియన్ డాలర్ల నిధుల సహాయానికి సంబంధించిన లెక్కలను తమకు పంపాలని ట్రంప్ ఆ దేశాన్ని డిమాండ్ చేశారు. ఇరు దేశాల మధ్య చర్చల్లో ఏర్పడిన ప్రతిష్ఠంభన అనంతరం శనివారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## జెలెన్‌స్కీకి ప్రపంచ దేశాల సంఘీభావం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఘర్షణ తర్వాత యూరోపియన్ భాగస్వామ్య దేశాలతోపాటు ఇతర ప్రపంచ నాయకులు జెలెన్‌స్కీకి మద్దతు ప్రకటించారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ 'అలాగే పటిష్ఠంగా, ధైర్యంగా, భయం లేకుండా ఉండు. నీవు ఎప్పటికీ ఒంటరివి కావు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఫిన్‌లాండ్ ప్రధాని పీటర్ ఆర్పన్, లక్సంబర్గ్ దేశ ప్రధాని లుక్ ఫ్రైడన్, పోలెండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా తదితరులు జెలెన్‌స్కీని ప్రశంసిస్తూ సందేశం పంపారు.

# ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ల మూసివేత

- యూఎస్ 'ఎయిడ్' నిలిపివేత ఫలితం
- హైదరాబాద్‌లో నిలిచిన వైద్య సేవలు




హైదరాబాద్ నారాయణగూడలోని ట్రాన్స్‌జెండర్ల క్లినిక్ (ఫైల్)

న్యూఢిల్లీ, మార్చి 1: అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందచేసే యూఎస్‌ఎయిడ్‌ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మూడు నెలలపాటు నిలిపివేయడంతో ట్రాన్స్‌జెండర్ల కోసం భారత్‌లో మొట్టమొదటిసారి ఏర్పాటు చేసిన మూడు క్లినిక్కులు మూత పడ్డాయి. ఇందులో ఒకటైన హైదరాబాద్‌లోని క్లినిక్ గత నెలలో మూత పడింది. యూఎస్ ఎయిడ్ నుంచి కార్యక్రమాల నిలిపివేత ఆదేశం కారణంగా దాదాపు 5 వేల మందికి సేవలకు అవరోధం ఏర్పడింది. అమెరికన్ల పన్నులతో కొనసాగుతున్న అన్ని ప్రాజెక్టులను సమీక్షించడానికి 90 రోజుల పాటు ఆర్థిక సహాయాన్ని నిలిపివేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని కళ్యాణ్, పుణెలో ట్రాన్స్‌జెండర్ల క్లినిక్‌లు(మిత్ర్ క్లినిక్‌లు) పని చేస్తున్నాయి. కాగా, ఈ క్లినిక్‌ల నిర్వహణ కోసం నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ వనరుల కోసం నిర్వాహకులు అన్వేషిస్తున్నారు. ఈ క్లినిక్‌ల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు మార్గదర్శనాన్ని హార్మోన్ థెరపీపై వైద్య సహాయం, మానసిక ఆరోగ్యం కోసం కౌన్సెలింగ్, హెచ్ఐవీ, ఇతర లైంగిక సంక్రమిత వ్యాధులపై అవగాహన, సాధారణ వైద్య సంరక్షణ వంటివి అందచేస్తున్నట్టు మిత్ర క్లినిక్‌లకు చెందిన వెబ్‌సైట్ పేర్కొంది. ఎనిమిది మంది సిబ్బంది పనిచేసే ఒక్కో క్లినిక్ నిర్వహణకు ఏడాదికి కనీసం రూ. 30 లక్షల వరకు అవసరమవుతుంది. అయితే హెచ్ఐవీ(ఎయిడ్స్) సోకిన రోగులకు ఇచ్చే ప్రాణరక్షక మందులు, చికిత్సను కొనసాగించేందుకు యూఎస్ ఎయిడ్ నుంచి మినహాయింపు లభించింది. ఈ క్లినిక్‌లకు చెందిన రోగులలో 10 శాతం మంది మాత్రమే హెచ్ఐవీ బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది.

## పాస్‌పోర్ట్ దరఖాస్తుకు మారిన నిబంధనలు

### ఇక బర్త్ సర్టిఫికెట్ ప్రూఫ్‌గా ఆ పత్రం సమర్పించాల్సిందే



న్యూఢిల్లీ, మార్చి 1: పాస్‌పోర్టు దరఖాస్తుకు సంబంధించి కేంద్రం శుక్రవారం నుంచి కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. సవరించిన పాస్‌పోర్టు నిబంధనలు 1980 ప్రకారం ఇక నుంచి 2023 అక్టోబర్ 1 తర్వాత జన్మించిన వారు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోవాలంటే జనన, మరణాల రిజిస్ట్రార్, మున్సిపల్ కార్పొరేషన్ లేదా ఏ ఇతర అధికార యంత్రాంగం జారీ చేసిన సర్టిఫికెట్‌ను మాత్రమే జన్మదిన ధ్రువీకరణ పత్రంగా సమర్పించాలి. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అక్టోబర్ 1, 2023కు ముందు జన్మించిన వారు జనన ధ్రువీకరణ రుజువుగా ఇతర పత్రాలను సమర్పించవచ్చు. దీని ప్రకారం స్కూళ్లు జారీ చేసే టీసీలు, మెట్రిక్యులేషన్, టెన్త్‌కు సంబంధించి బోర్డులు జారీ చేసే సర్టిఫికెట్లు, ఐటీ శాఖ జారీ చేసే పాన్ నెంబర్, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సర్వీస్ రికార్డు కాపీ, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ఆర్డర్, డ్రైవింగ్ లైసెన్స్, ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డు, ఎల్ఐసీ, ఇతర పబ్లిక్ కంపెనీలు జారీ చేసే పాలసీ బాండ్‌లను జనన ధ్రువీకరణ పత్రాలుగా సమర్పించవచ్చు. ఇప్పుడు సవరించిన నిబంధనలు కూడా 2023 అక్టోబర్ 1 తర్వాత పుట్టిన వారికి వర్తిస్తాయని చెప్పారు. కాబట్టి గ్రామీణులకు ఇవి పెద్దగా ఇబ్బంది కలగించవని అధికారులు స్పష్టం చేశారు.

## నలుగురి మృతి.. 50 మంది సురక్షితం

### ఉత్తరాఖండ్‌లో మంచు చరియల ఘటనలో ఐదుగురి ఆచూకీ గల్లంతు

న్యూఢిల్లీ, మార్చి 1: ఉత్తరాఖండ్‌లోని చమోలీలో శుక్రవారం మంచు చరియల కింద చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన 48 మంది బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్ఓ) కార్మికులలో ఒకరు చికిత్స పొందుతూ మరణించారు. మరో ఏడుగురిని మంచు చరియల కింద నుంచి వెలికితీయాల్సి ఉంది. మొత్తంగా ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, 50 మంది సురక్షితంగా బయటపడ్డారు. మరో అయిదుగురి ఆచూకీ తెలియడం లేదు. గాయాలతో బయటపడిన వారు మనాలోని ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసు(ఐటీబీపీ) శిబిరం వద్ద చికిత్స పొందుతున్నారు. ఐఈటీబీపీ సమీపంలోని మనా గ్రామం, మనా కనుమ మధ్య దాదాపు ఏడు అడుగుల మేర పేరుకుపోయిన మంచును తొలగించేందుకు 65 మందికి పైగా సహాయక సిబ్బంది రాత్రంతా శ్రమించారు. మంచు తుపానుతోపాటు దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. ప్రతి సంవత్సరం ఈ సమయానికి బీఆర్ఓ శిబిరం మూతపడడం జరుగుతుందని, కాని ఈ ఏడాది హిమపాతం అంతగా లేని కారణంగా బీఆర్ఓ శిబిరాన్ని మూయలేదని మనా గ్రామ పెద్ద పీతాంబర్ సింగ్ తెలిపారు. ఈ కారణంగానే మంచు చరియల కింద కార్మికులు చిక్కుకుపోయారని ఆయన అన్నారు.

## వారానికి 90 గంటలైనా పని చేయాలి


### నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ : జీవితంలో అత్యధిక సమయం పని చేయడానికే వెచ్చించాలనేవారి జాబితాలోకి నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ కూడా చేరారు. 'బిజినెస్ స్టాండర్డ్' నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కష్టపడి పని చేయకపోవడం గురించి మాట్లాడటం ఫ్యాషన్ అయిపోయిందన్నారు. ''కష్టపడి పని చేయడాన్నే నేను గట్టిగా నమ్ముతాను. వారానికి 80 గంటలైనా, 90 గంటలైనా భారతీయులు కష్టపడి పని చేయాలి. 4 ట్రిలియన్ డాలర్ల నుంచి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు ఎదగాలనేది మీ బలమైన ఆకాంక్ష అయితే, మీరు వినోదం ద్వారానో, సినీ తారల అభిప్రాయాలను అనుసరిస్తూనో దానిని సాధించ లేరు'' అని చెప్పారు. గడువు కన్నా ముందే ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తప్పనిసరిగా శ్రమించి పని చేయాలన్నారు. అదే సమయంలో నాణ్యతలో రాజీ పడకూడదని, ఖర్చులు మితిమీరకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన కొరియా, జపాన్‌లను ప్రస్తావించారు. ఈ రెండు దేశాలు పని పట్ల బలమైన నిబద్ధతను ప్రదర్శించినందువల్ల ఆర్థికంగా విజయం సాధించాయని తెలిపారు. భారత దేశం కూడా అటువంటి ఆలోచనా ధోరణిని అలవరచుకోవాలని చెప్పారు. ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థగా మారాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇది తప్పనిసరి అని తెలిపారు.

## కాంగ్రెస్‌లో షిండేగా మారనున్న డీకే!

### బీజేపీ రాష్ట్ర యూనిట్ నాయకుల సంచలన వ్యాఖ్యలు

### కర్ణాటకలో రాజకీయ భూకంపం వస్తుందని వ్యాఖ్య!



బెంగళూరు, మార్చి 1: కర్ణాటకలో రాజకీయ భూకంపం రాబోతున్నదని, త్వరలో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు ఉంటాయని ఆ రాష్ట్ర బీజేపీ నాయకులు సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు బీ శ్రీరాములు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, కర్ణాటక త్వరలో ఒక ఏక్‌నాథ్ షిండే ఉదంతాన్ని చూడబోతున్నదని అన్నారు. ఒకవేళ అదే గనుక జరిగితే..కాంగ్రెస్ చీలిక వర్గానికి మద్దతు ఇవ్వాలా? లేదా? అన్నది బీజేపీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. కోయంబత్తూరులో జరిగిన ఇషా ఫౌండేషన్ మహా శివరాత్రి ఉత్సవానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, డీకే శివకుమార్ హాజరు కావటం కర్ణాటక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. డీకే శివకుమార్ బీజేపీకి దగ్గరవుతున్నారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. 'అధికార కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్ షిండే నాయకులు చాలామంది ఉన్నారు. అందులో డీకే శివకుమార్ ఒకరు' అని బీజేపీ శాసనసభ పక్ష నేత ఆర్ అశోక్ అన్నారు. బీజేపీతో చేతులు కలిపి, కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చివేసే నాయకుడు డీకే శివకుమార్ కావొచ్చునని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే తనపై వస్తున్న ఊహాగానాల్ని డీకే శివకుమార్ ఖండించి, ఇదంతా బీజేపీ ప్రచారంగా కొట్టిపారేశారు.

## వాళ్లను 'వినియోగదారులు'గా భావించొద్దు!

### 'లాభార్జన' రుణాలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 1: లాభార్జన కోసం బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్నవారిని 'వినియోగదారులు'గా పరిగణించరాదని, వినియోగదారుల పరిరక్షణ చట్టం కింద అలాంటివారిని వినియోగదారులుగా పేర్కొనరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) ఉత్తర్వులకు వ్యతిరేకంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని రుణ ఎగవేతదారుగా పేర్కొంటూ క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా (సిబిల్)కు అక్రమంగా నివేదించినందుకు గాను ఆ సంస్థకు రూ.75 లక్షల నష్టపరిహారంతోపాటు కోర్టు ఖర్చులను చెల్లించాలని సెంట్రల్ బ్యాంకును ఎన్‌సీడీఆర్‌సీ ఆదేశించడంపై సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. వ్యాపార ప్రయోజనాల కోసం రుణాలు తీసుకున్న సంస్థలు వినియోగదారులు కారంటూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది.

## బెంగళూరుకు మంచి మంత్రి కావాలి

### ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో పాయ్

బెంగళూరు: 'ఈ నగరానికి ఏమైంది? మౌలిక సదుపాయాలు బాగు పడేదెన్నడు? 'బ్రాండ్ బెంగళూరు' సాకారమయ్యేనా?' అని మేధావులు ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఉన్న రాజధాని నగరంలో ప్రజలకు సరైన సదుపాయాలు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ టీవీ మోహన్‌దాస్ పాయ్ శనివారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, బెంగళూరు అభివృద్ధి శాఖను నిర్వహిస్తున్న డీకే శివ కుమార్‌ను కలిసిన తర్వాత విలేకర్లతో తన ఆవేదనను పంచుకున్నారు. బెంగళూరులో మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి డీకేతో మాట్లాడానని చెప్పారు. నగర ప్రజలకు హీరోగా నిలవాలని, దేశంలో అత్యుత్తమ నగరంగా బెంగళూరును తీర్చిదిద్దాలని ఆయనను కోరానని తెలిపారు. బెంగళూరు తలసరి ఆదాయం రూ.13,12,058 అని, దేశంలోనే ఇది అత్యంత సంపన్న నగరమని చెప్పారు. ఇది సైన్స్ సిటీ, స్టార్టప్ సిటీ అని పేర్కొన్నారు. ''మాకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత కావాలి, మంచి ఫుట్‌పాత్‌లు, ఉత్తమమైన ప్రజా రవాణా వ్యవస్థ కావాలి. సాధ్యమైనంత త్వరగా మెట్రో రైల్ పూర్తి కావాలి'' అని చెప్పారు.